క్లుప్తంగా

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సదస్యం



స్వామివారికి పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త కుమార్

మాడుగుల రూరల్: మండలంలో వి.వి.అగ్రహారంలోని లక్ష్మీనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం ఆలయంలో సదస్యం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి తిరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త దొండా కుమార్, భక్తులు ప్రధానార్చకుడు కిశోర్ పర్యవేక్షణలో ఉదయం నుంచి పూజలు నిర్వహించారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



రామలింగేశ్వరస్వామి పూజల్లో పాల్గొన్న సర్పంచ్ అప్పాజీ, తదితరులు

కె.కోటపాడు : ఆనందపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ 33వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రమా సత్యనారాయణ స్వామి కల్యాణాన్ని అర్చకుడు మురపాక అనీల్‌కుమార్ శర్మ శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో సర్పంచ్ వంటాకు అప్పాజీ, విన్నకోట అయ్యప్ప, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సత్యవరపు సత్యనారాయణమూర్తి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

సూదివలసలో చేతిబోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు : తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎంపీటీసీ వర్రి రామునాయుడు తెలిపారు. సూదివలసలోని చల్లా వారి నివాసాల వద్ద జెడ్పీటీసీ నిధులతో ఏర్పాటు చేసిన చేతిబోరును సోమవారం ఆయన ప్రారంభించారు. ఇక్కడ తాగునీటి సమస్యను జెడ్పీటీసీ ఈర్లె అనురాధ దృష్టికి తీసుకువెళ్లగా బోరు నిర్మాణానికి రూ.లక్ష నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో ఏర్పాటు జరిగిన బోరుతో తాగునీటి కష్టాలు తీరినట్లు ఎంపీటీసీ రామునాయుడు తెలిపారు.

నృసింహస్వామి ఆలయంలో కుంకుమ పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

చీడికాడ: మండలంలో అర్జునగిరి శ్రీస్వయంభూ శ్రీదేవి, భూదేవి నృసింహస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం కుంకమ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పి.శ్రీనివాసచార్యులు సారథ్యంలో మంగళవారం సత్యనారాయణ మూర్తి వ్రతాలు జరగనున్నాయి. 12న నాగవల్లి సంబరాలు, 13న పుష్పాంజలి సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

మాకవరపాలెం: మండలంలోని తామరంలో సోమవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. రూ.10 లక్షలతో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు గొంతిన హరిబాబు, సర్పంచ్ చెల్లారత్నంతో పాటు గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

లీకేజీల తాండవం



తాండవ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేస్తున్నట్లుగా కాలువలో ప్రవహిస్తున్న లీకేజీ నీరు



నాతవరంలో మినప చేను మధ్యలో ప్రవహిస్తున్న నీరు



లీకేజీ నీటితో ముంపునకు గురైన మినప పంట

నాతవరం: తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్ల ద్వారా లీకేజీ నీరు కారణంగా మినప పంట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో రైతులు మండలంలో సుమారుగా 4,328 ఎకరాల్లో మినప పంట సాగు చేస్తున్నారు. ఈ మినప పంట తాండవ ఆయకట్టు భూముల్లో సాగవుతోంది. ప్రస్తుతం మినప చేను ఏపుగా పెరిగి కాయలు కాసి పండేందుకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితిలో తాండవ ప్రధాన గేట్ల నుంచి లీకేజీ ద్వారా వృథాగా ప్రవహించే నీరు మినప చేనులోకి చేరుతోంది. నాతవరం, చమ్మచింత, పొట్టినాగన్న, దొరపాలెం, గుమ్మడిగొండ, వల్సంపేట, శరభవరం, తదితర గ్రామాల్లో మినప చేనులోకి తాండవ ప్రాజెక్టు లీకేజీ నీరు పోయి కాయ దశలో ఉన్న పంటను దెబ్బతిస్తోంది. తాండవ ఆయకట్టు పరిధిలో మినప చేను వేసిన భూములన్నీ నీరు ప్రవహించే కాలువలకు ఇరువైపులా ఉండటంతో ఈ సమస్య వస్తోంది. లీకేజీ నీరంతా మినప చేనులోకి పోవడంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తాండవ కాలువలో ప్రస్తుతం ప్రవహిస్తున్న నీటిని చూస్తే సాధారణ రోజుల్లో ఆయకట్టుకు నీరు విడుదల చేసినట్లుగా కనిపిస్తోంది. మినప పంట వేసిన దగ్గర్నుంచి లీకేజీ నీరు నుంచి పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృథాగా పోతున్న లీకేజీ నీటిని అరికట్టాలని తాండవ ప్రాజెక్టు అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లినా కనీసం పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మరో వైపు నిత్యం లీకేజీ ద్వారా నీరు బయటకు పోవడంతో తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గిపోతోంది. ఇలా నీరు ఎవరికి ఉపయోగపడకుండా గెడ్డలోకి వృథాగా పోతుందని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని కోరుతున్నారు.

'పది'లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఎంఈవో -1 పాండురంగారావు.

మాడుగుల: వచ్చేనెల 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు అందిస్తున్నామని ఎంఈవో-1 పాండురంగారావు తెలిపారు. సోమవారం ఆయన మాడుగులులో సాక్షి విలేకరితో మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు అందజేసిన ఎస్‌ఎస్‌సీ సక్సెస్ క్వశ్చన్ బ్యాంకు, మోడల్ పేపర్స్ బాగా చదివినవారికి 80 శాతం మార్కులు సాధించవచ్చునన్నారు. మంచి దస్తూరీతో స్కోరింగ్ వస్తుందన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ విద్యార్థులు ఆరోగ్యంతో పాటు చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. వంద రోజుల ప్రణాళిక పక్కాగా అమలవుతుందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి విద్యార్థి తెల్ల కాగితంపై ప్రశ్నలు రాయడం ప్రాక్టీస్ చేసుకోవాలన్నారు. సమాధాన పత్రం పైభాగాన, కుడి వైపు, ఎడమ వైపు అరంగుళం ఖాళీ వదిలి దస్తూరీగా సమాధానాలు రాస్తే మంచి మార్కులు సాధించవచ్చునన్నారు. మాడుగుల మండలంలో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 783 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు.

క్యాన్సర్‌పై విస్తృత ప్రచారం అవసరం



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి యం.రాజేష్‌నాయుడు

నాతవరం: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి యం.రాజేష్‌నాయుడు అన్నారు. నాతవరం హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ఎలాంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించేందుకు ఇటీవల ప్రభుత్వం ఇంటింటా సర్వే చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కనకరాజు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పైడిపాలలో 130 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి చరిష్మ

మాకవరపాలెం: మండలంలోని పైడిపాలలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 130 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. 47 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం బూరుగుపాలెం వైద్యాధికారి చరిష్మ మాట్లాడుతూ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాబింక ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు



ఆలయం వద్ద కెమెరాలు ఏర్పాటు చేసిన సర్పంచ్ శ్రీను, గ్రామ పెద్దలు

బుచ్చెయ్యపేట: మండలంలో కేపీ అగ్రహారంలో కొలువుదీరిన నూకాలతల్లి ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని ఆది, మంగళ, గురు, శుక్రవారాల్లో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. కానుకలు కూడా బాగానే వేస్తారు. ఈ క్రమంలో ఇటీవల గుర్తు తెలియని దొంగలు ఆలయ హుండీలను పగలగొట్టి నగదు పట్టుకుపోయారు. దీంతో ఎస్‌ఐ శ్రీనివాసరావు సూచన మేరకు సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఉప సర్పంచ్ దేవర ముసలినాయుడు, గ్రామ పెద్దలు కలిసి సోమవారం ఆలయం బయట, లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ



గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంపీడీవో మేరీ రోజ్

గొలుగొండ: పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మిదేవిపేట గ్రామంలో నిధులను సర్పంచ్ విజయలక్ష్మి, ఆమె భర్త రామకృష్ణనాయుడు దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఎంపీడీవో మేరీ రోజ్ సోమవారం విచారణ చేపట్టారు. జమ్మిదేవిపేట గ్రామంలో గ్రామస్తులు రామాలయ నిర్మాణ కోసం కొంత నిధులతో పునాదులు నిర్మాణం చేపట్టగా.. సర్పంచ్ ఈ పనులకు ఎంబుక్ చేయించి నిధులు మార్చుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించారు. అప్పట్లో పని చేసిన పీఆర్ జేఈ ఢిల్లీశ్వరి, కార్యదర్శి రఘుతో పాటు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కొంతమేర నిధులు దుర్వినియోగమైనట్టు ప్రాథమికంగా విచారణలో తేలినట్టు ఎంపీడీవో తెలిపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణ

నర్సీపట్నం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తమ నైపుణ్యాలకు పదును పెట్టుకొని జీవితంలో విజేతలుగా నిలవాలన్నారు. ముఖ్యవక్తగా విచ్చేసిన ఎస్‌టీఈపీ అధికారి ఎస్.ఎ.బాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. వైఫల్యాలను అధిగమించుకుంటూ ముందుకు సాగాలన్నారు. తమకున్న విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విస్తృత ప్రచారం



రోలుగుంటలో ప్రచారం చేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

రోలుగుంట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి ప్రజాసంఘాలతో కలసి సోమవారం రోలుగుంటలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె పలువురు ఉపాధ్యాయులను కలిశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పరిష్కారం సాధ్యం కాని సమస్యలను పరిష్కరిస్తానని మాయ హామీలు ఇవ్వడం, మోసం చేయడం తన నైజం కాదన్నారు. ఈ ప్రచారంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరిగల్ల రాజు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ, బంగారమ్మ తీర్థం



పాతవలసలో మరిడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు : పాతవలసలో మరిడిమాంబ, బంగారమ్మ అమ్మవార్ల తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. ఆయా అమ్మవార్ల ఆలయాల్లో ఉదయం నుంచి గ్రామానికి చెందిన మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి బంధువులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి వాతావరణం నెలకొంది. రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ జామి శ్రావణ్ ఏర్పాట్లు చేశారు.

కొల్లేటి కొంగల సందడి



మాడుగుల: మండలంలో సత్యవరం పంట పొలాల్లో సోమవారం కొల్లేటి కొంగలు సందడి చేశాయి. ప్రతి ఏటా మాడుగుల మండలం సత్యవరం, జేడీపేట, కింతలి, జాలంపల్లి, పెద్దేరు జలాశయం పరిసర ప్రాంతాలకు ఫిబ్రవరి నెలలో వచ్చి మరలా తొలకరి సమయంలో వెళ్లిపోతుంటాయి. అదే మాదిరిగా సోమవారం పొలాల్లో కొల్లేటి కొంగలు దర్శనమిచ్చాయి. పొలాల్లో ఉన్న పంటలను నాశనం చేసే చీడ పురుగులను ఈ కొంగలు ఏరివేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



కె.కోటపాడులో విద్యార్థికి మాత్ర వేస్తున్న ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవో ప్రసాద్



ఎం.గదబూరులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారులు



నాతవరంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

కె.కోటపాడు : విద్యార్థుల్లో రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు డీవార్మింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్టు ఎంఈవో డీవీడీ ప్రసాద్ తెలిపారు. కె.కోటపాడు హైస్కూల్‌లో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కె.కోటపాడులో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో ప్రసాద్, ఎంపీడీవో సాంబశివరావు, హెచ్‌ఎం పద్మావతి పాల్గొని విద్యార్థులకు మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ప్రసాద్ మాట్లాడుతూ శుభ్రం చేసుకోని చేతులతో ఆహారం తింటే కడుపులోకి మలినాలు ప్రవేశించి నులిపురుగులు వ్యాపిస్తాయన్నారు. ఈ పురుగుల నివారణకు ప్రతి ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు, ఏఎన్‌ఎం కుమారి మాత్రలు పంపిణీ చేశారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల పరిధిలో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 6,129 మందికి గాను 5,864 మందికి మాత్రలు అందజేశారు. మాడుగుల గదబూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాద్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, పీహెచ్‌ఎన్ ఇందిర పాల్గొన్నారు. కింతలి పీహెచ్‌సీ పరిధిలో 3,669 మందికి గాను 3302 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి కె.మాలంనాయుడు తెలిపారు.

నాతవరం: నాతవరం పీహెచ్‌సీ పరిధిలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు, 40 పాఠశాలల్లో 5,461 మంది చిన్నారులకు డీవార్మింగ్ మాత్రలు వేశామని వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో 28 పాఠశాలలు, 37 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,659 మంది చిన్నారులకు మాత్రలు వేశామని వైద్యాధికారి అనూష్ తెలిపారు. మిగతా చిన్నారులకు ఈ నెల 17న డీవార్మింగ్ మాత్రలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

3800 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు

మాకవరపాలెం: మండలంలో 3800 మంది విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేశామని ఎంఈవో మూర్తి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన డీ వార్మింగ్ డేలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సీతారామలక్ష్మి ఆల్బెండజోల్ మాత్రల వద్ద కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, హెచ్‌ఎం అచ్యుతరామయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మండలంలో 14 సంవత్సరాల లోపు విద్యార్థిని, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. పలు గ్రామాల్లో విద్యార్థులకు అందిస్తున్న నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జెడ్పీ బాలికోన్నత, గవరవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు పలు పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో బి.పిచ్చమ్మ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీవోలు రత్నభారతి. డి.మాల్యాద్రి, సీనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎంపీడీవో పి.వి.ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేష్, చోడవరం ఈవో నారాయణరావు, వైద్యాధికారులు ప్రదీప్, భారతి, సత్యదీపిక, ఎంఈవోలు సింహాచలం, తిరుపతిరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక హెచ్‌ఎం, ఇన్‌చార్జ్ ఎంఈవో బి.పదాల్‌దాస్‌తో కలిసి దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన విద్యార్థులకు దగ్గరుండి వైద్య సిబ్బందితో ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. వేచలం స్కూల్‌లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి గోవిందరెడ్డి విద్యార్థులకు మాత్రలు వేశారు.

చీడికాడ: మండలంలో చీడికాడ, పెదగోగాడ పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సోమవారం డీవార్మింగ్ డే సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో మాత్రలు వేస్తున్న ఎంఈవో మూర్తి



దేవరాపల్లి హైస్కూల్‌లో మాత్రలు వేస్తున్న వైద్యాధికారి పూజ్యమేఘన, ఎంఈవో పడాల్‌దాస్



దిబ్బిడిలో విద్యార్థులకు నులి పురుగుల మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నర్సీపట్నం: మున్సిపాలిటీ శివారు సుబ్బరాయుడుపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాకవరపాలెం మండలం, చంద్రయ్యపాలెంకు చెందిన వంటాకుల గంగాధర్(28) బైక్‌పై ఆదివారం రాత్రి నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో జరిగిన గ్రామదేవత పండగకు బంధువుల ఇంటికి వెళ్లాడు. పండగ చూసుకుని తిరిగి ఇంటికి వస్తూ పొగమంచు కమ్మేయడంతో అదుపు తప్పి సుబ్బారాయుడుపాలెం వద్ద చెట్టును ఢీకొట్టాడు. గంగాధర్ తలకు బలమైన గాయమైంది. 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారని సీఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బుచ్చెయ్యపేట: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

వడ్డాదిలో 30 మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లు చూపిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో సోమవారం వడ్డాదిలో తనిఖీలు నిర్వహించారు. ఓ ఇంట్లో మద్యం అమ్ముతున్న వ్యక్తితో పాటు అతని వద్ద ఉన్న 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్లు, వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.